

# సంసారంలో సరిగమలు - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## అమ్మ చెక్కిన బొమ్మ

**"అమ్మా ఫోన్**..మీ అక్క" తల్లికి ఫోన్ అందించింది ఆముక్త

"మీ అక్క ఏమిటి? పెద్దమ్మ అనచ్చుగా?" లోగొంతుతో మందలించింది.

"అక్కా. ఎలా ఉన్నావ్? ఏమిటి విశేషాలు?" అడిగింది వందన.

"ఏం లేదు వందీ.." ఉపోద్ఘాతంగా ఆగింది పల్లవి.

"వందీ ఏమిటి పందిలాగా. అలా అనద్దని ఎన్నిసార్లు చెప్పాను?" చిరాకు పడింది వందన.

"ఏదో అలవాటుగా వచ్చిందిలే. మరేంలేదు పవిత్రకి మీ ఊర్లో ఉన్న ఏదో కంపెనీలో ఇంటర్న్‌షిప్ వచ్చిందిట మూడు నెలలు. అది హాస్టల్‌లోఉంటానంది, కానీ నేనే ఆడపిల్లవి ఒంటరిగా ఎందుకు పిన్ని దగ్గర ఉండు అని చెప్పాను. దానికి తెగ మొహమాటం. అందుకని ఫోన్ చేసి చెప్పు పిన్నికి అని ఒకటే గోల. బావ తర్వాత మరిదితో మాట్లాడతారులే. టిక్కెట్ కొన్నాక ఎప్పుడు వచ్చేదీ చెప్తాను" పల్లవి ఫోన్‌కట్ చేసింది.

"ఏంటిట సంగతి? ఏదో లేకపోతే మీ పల్లవి ఫోన్ చేయదు." ఎగతాళిగా చెప్పింది ఆముక్త.

"అనుపల్లవి ఓ మూడు నెలలు మనింట్లో ఉంటుందిట." విసుగ్గా చెప్పింది వందన.

"ఆం! బాబోయ్! దాన్నెవరూ భరించలేరమ్మా. వద్దని చెప్పచ్చుగా? పోనీ మనం మూడునెలలు సంపూర్ణ భారతదేశ తీర్థయాత్రలకి వెళ్తున్నామని చెప్పకపోయావూ?" ఆముక్త దిగులుగా చెప్పింది.

"అది నన్ను పర్మిషన్ అడిగితే అలాగే చెప్పేదాన్ని. కానీ ఇన్ఫర్మేషన్ చెప్పింది. టిక్కెట్ కొన్నాక ఎప్పుడొచ్చేది చెప్తానంది."

"ఎన్ని హాస్టల్స్ లేవు? మన నెత్తికెక్కకపోతే మూడు నెలలూ ఏదైనా వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్‌లో ఉండచ్చుగా?"

"ఆడపిల్ల వంటరిగా ఉండటం భయంట"

"మొత్తం బిల్డింగ్ అంతా ఇదే ఉంటుందా? ఇంకా చాలామంది ఆడపిల్లలు ఉంటారుగా?"

"అందరితో పోలిస్తే పల్లవికి కోపం వస్తుంది. వాళ్ళ పవిత్ర స్పెషల్ కదా?"

"ఔనౌను. వచ్చి నన్ను కొట్టి మళ్ళీ వెళ్ళిపోతుంది. మీరు మూడు బెడ్‌రూమ్స్ ఇల్లు కొనాల్సింది. ఇప్పుడు దాంతో రూం షేర్ చేసుకోవడం అంటే మాటలుకాదు. టెన్త్ సెలవుల్లో చూసాగా నస. పతివ్రత కబుర్లు, దాన్ని అదే పొగుడుకోవడం, అంతా ఎలా పొగిడారో చెప్పుకోడం, నన్ను విమర్శించడం. హే రామ్! ఈ అతి పవిత్ర బారినించి ఎలా బయటపడాలి?" ఆముక్త గుప్పెటతో నుదురుమీద కొట్టుకుంది.

"విధి బలీయమైంది" వందన విషాదంగా చెప్పింది.

"వందీ. ట్వంటీ ఫస్ట్‌న ఇండిగో ఫ్లయిట్‌లో వస్తున్నాం. ఏర్‌పోర్ట్‌కి వద్దులే మీ బావగారున్నారుగా" ఉదారంగా చెప్పింది పల్లవి.

"ఏంటీ మీరిద్దరు కూడా వస్తున్నారా?" వందన ఆశ్చర్యంగా అడిగింది.

"మరి? ఆడపిల్లని ఒక్కదాన్నే పంపుతామా?" పల్లవి కూడా ఆశ్చర్యంగా అడిగింది. వైజాగ్ నించి హైదరాబాద్‌కి ఒక్కటే ఆడపిల్ల రాలేదుట. అదీ ఫ్లయిట్‌లో. వందన మనసులోనే పళ్ళునూరుకుని అడిగింది.

"మూడు నెలలు నీ కూతుర్ని మిస్ అవుతున్నావని బాధగా ఉందా? కూడా వస్తున్నావు"

"నీలాగా రాయిననుకుంటున్నావా? నువ్వు కాబట్టి దాన్ని ఆ పిలానీలో చేర్చి చదివించావు. నాలుగేళ్ళు దాన్ని వదిలి ఉండటం అంటే నావల్లకాదు."

ఎందుకు అడిగానా అని వందన తనని తను తిట్టుకుంది.

"సర్లేవే. వచ్చాక మాట్లాడుకుందాం" పల్లవి ఫోన్ పెట్టేసింది.

"చూడూ. నువ్వు పవిత్రని ఏం విమర్శించద్దు. నీకు కష్టమే అని తెలుసుకానీ ఈ మూడు నెలలూ ఎలాగో భరించు. ఇప్పటికే చుట్టాలు, పల్లవి ఎంత మంచిది, పిల్లని ఎంత శ్రద్ధగా కంట్రోల్‌లో ఉంచి పెంచుతోంది, ఎంత భక్తి, ఎంత వినయం అని కథలు కథలుగా చెప్పుకుంటున్నారు. నీతో పోల్చి పవిత్ర, నాతో పోల్చి పల్లవి బుద్ధిమంతులని, పద్ధతిగా ఉంటారని, మనలాంటి అరాచకవాదులు కాదని తీర్మానించారు. ఇప్పుడు ఇంకా అనే అవకాశం ఇవ్వకు. " ఆముక్తతో చెప్పింది.

"మరి మనలాంటి చెడ్డవాళ్ళింటికి రావడం ఎందుకు? మనింట్లో మూడు నెలలు ఆ పవిత్రురాలిని ఉంచడం ఎందుకు?" ఆముక్త విసురుగా అడిగింది.

"మా పల్లవి పైసా పోతే ప్రాణం పోతుందనే రకం. మిస్డ్‌కాల్స్ తప్ప మామూలు కాల్ చేయదు. ఒకవేళ చేయాల్సి వస్తే నిమిషం కంటే ఎక్కువ మాట్లాడదు. స్టాప్ వాచ్ సెట్ చేసినట్లు అరవయ్యో క్షణంలో ఆపేస్తుంది. అలాంటిది మూడు నెలలు హాస్టల్ ఫీజ్ కడుతుందా? బావకి విమానప్రయాణాలు ఎలిజిబుల్ కాబట్టి ఫ్లయిట్. లేకపోతే రైల్లో జనరల్ కంపార్ట్‌మెంట్‌లో వచ్చేవాళ్ళు." కసిగా చెప్పింది వందన.

ఇంట్లోకి అడుగుపెడుతూనే పల్లవి కళ్ళు ఆముక్తని నిశితంగా చూసాయి. చిన్న నిక్కర్, టీ షర్ట్ వేసుకుని ఉంది.

"ఏంటే మీ అమ్మ ఒంటినిండా బట్టలు కూడా కొనిపెట్టడంలేదా?" వెటకారంగా అడిగింది.

"పాతికేళ్ళు వచ్చి ఇంకా అమ్మకొని పెట్టడం ఏంటి పెద్దమ్మా" ఆముక్త నవ్వు నటిస్తూ అడిగింది.

"అబ్బో! పాతికేళ్ళని గుర్తుందన్నమాట. మరి ఐదేళ్ళ పిల్ల డ్రెస్ వేసుకున్నావే? తెల్లగా ఉన్నంత మాత్రాన తొడలు కనిపించే డ్రెస్ వేసుకోవాలా?" పవిత్ర నల్లగా ఉంటుందని పల్లవికి బాధ.

అమ్మూ పెదనాన్నగారికి మంచినీళ్ళు ఇవ్వు. "రా అక్కా లోపలికి వెళ్దాం."

"ఏం పవిత్రా బావున్నావా?" వందన కల్పించుకుని చెప్పింది.

నిండుగా పంజాబీ డ్రెస్ వేసుకుని ఉన్న పవిత్ర వంగి వందన కాళ్ళకి దండం పెట్టింది. బిత్తరపోయిన వందన దూరంగా జరిగింది.

"పర్లేదు. పెద్దదానివేగా. పెద్దవాళ్ళ కాళ్ళకి నమస్కారాలు చేయడం మా పవిత్రకి అలవాటు" పల్లవి గర్వంగా చెప్పింది.

"దానికి అలవాటేమోకాని, అలా దండాలు పెట్టించుకోవడం నాకు చిరాకు పవిత్రా. అమ్మూ గదిలోకి వెళ్ళు" వందన చెప్పింది.

పవిత్ర తన సూట్‌కేస్ తీసుకుని అమ్ము వెనక నడిచింది.

"ఇంతకీ ఆ గుజరాతీవాడు అమలులో ఉన్నాడా? జెండా ఎత్తేసాడా?" పల్లవి ఆరాగా అడిగింది.

"మూడేళ్ళ ప్రాజెక్ట్ మీద అమెరికా వెళ్ళాడు" కోపాన్ని దిగమింగుతూ చెప్పింది వందన. 'నయం అమ్మూ వినలేదు' అని మనసులో సంతోషించింది.

ఆముక్త తనతో బిట్స్‌లో చదువుకున్న ఓ గుజరాతీ అబ్బాయిని ప్రేమించానని చెప్పి, అతన్ని ఓసారి ఇంటికి తీసుకొచ్చి తల్లితండ్రులకి పరిచయం చేసింది. అబ్బాయి మంచివాడు, తెలివైనవాడు అని గమనించాక వాళ్ళ పెద్దవాళ్ళతో మాట్లాడటానికి బాంబేకి తోడుగా రమ్మని పల్లవికి ఫోన్ చేసింది వందన.

"నేను రానే. వస్తే ఈ పెళ్ళికి నేను ఒప్పుకున్నాననుకుంటుంది పవిత్ర." చెప్పింది పల్లవి.

"అంటే?"

"పేపర్ భాషలో చెప్పాలంటే దానికి తప్పుడు సంకేతాలు వెళ్తాయి. రేపెప్పుడైనా అది ఇట్లాగే అమ్మూలాగా ఏ గన్నాయిగాడ్నో పెళ్ళిచేసుకుంటా అంటే నేను ఊరుకోనుగా. కాళ్ళు చేతులు విరగ్గొట్టి కూర్చోపెడతా. అప్పుడు అదేం అంటుంది? 'అమ్మూ పెళ్ళిమాటలకి వెళ్ళావు. దాన్ని ఒప్పుకున్నట్లేగా మరి నా ప్రేమని ఎందుకు ఒప్పుకోవు' అని అడగొచ్చు. ఐనా నా కూతురు తొంభై తొమ్మిది పాళ్ళు ఇలాంటి వెధవ్వేషాలు వేయదు. ఇలాంటి వాళ్ళని చూసి వేసినా దాన్ని కంట్రోల్ చేసే స్థాయిలో ఉండాలిగా నేను?" పెద్ద ఉపన్యాసం ఇచ్చింది పల్లవి.

మారు మాట్లాడకుండా ఫోన్ పెట్టేసింది వందన.

ఆ తర్వాత తల్లిద్వారా ఆ గుజరాతీ వాళ్ళు బాగా ధనవంతులని, రాజకీయ పలుకుబడి ఉన్నవాళ్ళని, అమ్మూని వాళ్ళు బాగా ఇష్టపడ్డారని తెలిసాక పల్లవి వందనకి ఫోన్ చేసి చెప్పింది.

"కంగ్రాట్స్. వ్రతం చెడ్డా ఫలం దక్కాలన్నట్లు, అమ్మూ మంచివాడినే పటాయించింది."

ఆ మాటలకి మనసు నొచ్చుకున్న వందన అక్కతో సాధ్యమైనంత తక్కువ మాట్లాడసాగింది. ఈలోగా బంధుమిత్రులందరికీ ఆముక్త ప్రేమకథని ప్రచారం చేసేసింది పల్లవి. పనిలో పనిగా తన పెంపకం, కూతురి అమాయకత్వం గురించి కూడా కాస్తంత ఎక్కువే చెప్పుకుంది.

"ఇన్నేళ్ళ తర్వాత కలిసిన అక్కతో సరిగ్గా కలవలేకపోయింది వందన. ఆమె ఏ మాత్రం మారలేదు. అదే వ్యంగ్యం, అదే వెటకారం స్వంత అక్కచెల్లెళ్ళయినా చెల్లెలు తనకంటే అందంగా ఉంటుందని, తెలివైందని పల్లవికి అసూయ. కాకపోతే మరిదికంటే తన భర్త ఉద్యోగం మంచిదన్నది ఆమెకి ఊరట. అలాగే పవితకి తల్లిరంగు, రూపం రాకుండా అత్తగారివైపు నలుపు, పోలికలు వచ్చాయని, ఆముక్త అందంగా ఉంటుందని పల్లవికి ఆక్రోశం.

రెండురోజులుండి, కూతురికి సవాలక్ష జాగ్రత్తలు, చెల్లెలికి లక్ష అప్పగింతలు చెప్పి అసంతృప్తిగానే పల్లవి విశాఖ విమానం ఎక్కింది.

"పాపం పవిత్ర మంచిదేనమ్మా" రెండు రోజుల తర్వాత ఆముక్త తల్లితో చెప్పింది.

"అవును. దానివల్ల నాకేం ఇబ్బంది లేదు. పాపం ముందు అతిగా ఊహించుకున్నాం" వందన చెప్పింది.

పవిత్ర ఉదయం ఏడున్నర. ఎనిమిది మధ్య లేస్తుంది. పక్కదుప్పట్లు మడతపెట్టి, ఏకంగా ఒకసారి స్నానం చేసి గదిలోంచి బయటకి వస్తుంది.

"ఏమైనా హెల్ప్ చేయాలా పిన్ని?" మొదటిరోజు అడిగింది.

"నీకేం తోస్తే అది చెయ్యి. మా ఇంట్లో బాబాయ్‌తో సహా అంతా తలోపని చేస్తారు." వందన చెప్పింది.

దాంతో డైనింగ్ టేబుల్ క్లీన్ చేయడం, వంటింట్లోంచి వండిన పదార్థాలు తెచ్చి టేబుల్ మీద సర్దడం, తిన్నాక మళ్ళీ వాటిని లోపల పెట్టడం అనే డ్యూటీని తీసుకుంది పవిత్ర.

టిఫిన్ తిని, లంచ్ బాక్స్ తీసుకుని తాను ఇంటర్న్‌షిప్ చేసే ఆఫీస్‌కి వెళ్ళి మళ్ళీ సాయంత్రం ఆరున్నరకి వస్తుంది. వచ్చాక కొద్దిసేపు టి.వి చూసి, ఆరిన బట్టలు మడతపెట్టి ఎవరి బట్టలు వాళ్ళరూంలో పెడుతుంది. అందరితో కలిసి భోజనం చేసి ఆముక్తతో కబుర్లు చెప్తూ పడుకుంటుంది.

ఆదివారం రోజు అంతా తీరికగా ఉన్నారు. తల్లివెనక తిరుగుతూ సహాయం చేస్తున్న పవిత్రని చూసి ఆముక్త చెప్పింది.

"పత్రా. నువ్వు బ్లాక్ బ్యూటీవి. పెద్దమ్మ అనవసరంగా మీ నానమ్మని ఆడిపోసుకుంటుంది కానీ నీ స్కిన్ ఎంత బావుంటుందో మంచి పోలికలు. నీ పలువరుస ముత్యాలకోవే. ఇంక ఈ రోజుల్లో ఇంత పొడుగాటి జుట్టున్న అమ్మాయిని చూడలేదనుకో. కాకపోతే ఆ కళ్ళజోడే బాలేదు."

పవిత్ర అక్కవైపు చూసి విశాలంగా నవ్వింది.

"ఇంటర్‌లోకి రాగానే లెన్స్ పెట్టుకుంటా అన్నా. మా అమ్మ ఒప్పుకోలేదు. కళ్ళు పాడవుతాయని భయపడింది."

"పెద్దమ్మకి ఉన్న అనుమానరోగం ఈ విషయంలో అక్కడ బయటపడిందా?" నవ్వింది అమ్మూ.

వందన భయంగా చూసింది.

పవిత్ర పెద్దగా నవ్వి చెప్పింది.

"కరెక్ట్‌గా చెప్పావు అక్కా. అనుమానం ముందు పుట్టి తర్వాత మా అమ్మ పుట్టింది."

"సో. గంటలో రెడీ అయితే మనం వెళ్ళి లెన్స్ తెచ్చుకుందాం. ఈ వీధి చివరున్న సందీప్ ఆప్టికల్స్ వాడు నా ఫ్రెండే రెండు కళ్ళకీ ఒకే పవర్ అయితే వెంటనే ఇస్తాడు తేడా ఉంటే రెండురోజుల్లో ఇస్తాడు. పద"

"అమ్మో! అమ్మేమంటుందో అక్కా" పవిత్ర ఆ ఆశ నిరాసల మధ్య ఊగిసలాడుతూ చెప్పింది.

"ఎవరు చెప్తారు? మూడు నెలల తర్వాత చూసి, నీకళ్ళు నిక్షేపంగా ఉన్నాయని ఊరుకుంటుంది పదపద" ఆముక్త ధైర్యం చెప్పింది.

ఇద్దరూ వెళ్ళి కాంటాక్ట్ లెన్స్ తెచ్చుకున్నాక పవిత్ర కొంచెం ప్రాక్టీస్ చేసి వాటిని విజయవంతంగా కళ్ళకి అమర్చుకుంది.

"కళ్ళజోడుతో నీ అందం తెలీలేదే ఆర్ట్ మూవీ హీరోయిన్‌లా ఉన్నావు. కాకపోతే కొంచెం లావుగా ఉన్నావు. రేపటినించి ఆరింటికి లేపుతాను. ఇద్దరం జాగింగ్‌కి వెల్దాం. ఓకే?" ముక్త అడిగింది.

"ఓకే" పవిత్ర ఉత్సాహంగా చెప్పింది.

ఆముక్త ట్రాక్ సూట్ వేసుకున్న పవిత్ర జాగింగ్ నించి తిరిగి వచ్చాక చెప్పింది.

"అక్కా! ఎంత నచ్చిందో రోజూ నీతో వస్తాను"

"డన్!" ఆముక్త ఒప్పుకుంది.

"అమ్మా! నీకో సీక్రెట్ చెప్పనా?" ఓ మధ్యాహ్నం అడిగింది ఆముక్త. ఆ రోజు ఆమెకి ఆఫీస్‌లేదు. వర్క్ ఫ్రం హోం చేస్తోంది.

"ఏమిటి?"

"పవిత్రకి ఓ బాయ్‌ఫ్రెండ్ ఉన్నాడు."

"ఏమిటీ?" వందన నిర్ఘాంతపోయింది ఆమె చేతిలోని రిమోట్ కింద పడిపోయింది.

"అవును. రోజూ రాత్రుళ్ళు అది ఫోన్‌లో మాట్లాడుతూంటుంది."

"పల్లవి నన్ను చంపేస్తుంది." వందన గొణిగింది.

"ఎందుకు చంపడం? విక్టర్‌తో దానికి వైజాగ్‌లోనే పరిచయం."

"విక్టరా? క్రిస్టియన్ అబ్బాయా? అది చస్తే ఒప్పుకోదు" వందన మరోసరి నిర్ఘాంతపోయింది.

"అదంతా పవిత్ర చూసుకుంటుందిగా. నువ్వు కంగారుపడకు. నాకు తెలిసిన విషయం నీకు చెప్పడం అలవాటు కాబట్టి చెప్పా అంతే" దానితో ఏం అనకు.

ఆముక్త తల్లిని ఊరడించింది.

పవిత్ర ఇప్పుడు కొంచెం సన్నబడింది. ఆఫీస్ నించి రాగానే ఆముక్త నిక్కర్లు, టీషర్ట్ వేసుకుంటోంది. పల్లవి కుట్టించిన దుప్పటి లాంటి మందమైన పైజమాలు మానేసింది. కళ్ళజోడు కేవలం రాత్రిళ్ళు బాత్‌రూంకి వెళ్ళడానికే పెట్టుకుంటోంది. "గొంగళి పురుగు సీతకోకచిలుకయింది" ఆముక్త వేళాకోళం చేస్తే నవ్వుతూ చెప్తుంది.

"నిజమే అక్కా"

మరోవారంలో పవిత్ర వెనక్కి, వైజాగ్ వెళ్ళిపోతూందంటే వందనకి దిగులుగా అనిపించింది.

మధ్యాహ్నం మూడుకి బెల్ మోగితే తలుపు తీసిన వందన ఎదురుగా పవిత్రని చూసి ఆశ్చర్యపోయింది.

"ఏంటమ్మా అప్పుడే వచ్చావు? మొహం వాడిపోయింది. ఒంట్లో బాలేదా?" కంగారుగా అడిగింది.

"బానే ఉన్నా పిన్ని. ఇవాళ నా ఇంటర్న్ లాస్ట్‌డే అయిపోయింది." పవిత్ర గదిలోకి వెళ్ళిపోయింది.

కొద్దిసేపటికి దుప్పటి పైజమా వేసుకుని కాళ్ళీడ్చుకుంటూ బయటకి వచ్చింది.

"అదేంటి? నిండుగా బట్టలు వేసుకోవాలనిపించిందా?" వందన నవ్వుతూ అడిగింది.

"కాదు పిన్నీ. అమ్మా నాన్న రాత్రికి వస్తున్నారు." పేలవంగా నవ్వుతూ చెప్పింది. "అవునా? మరి పల్లవి ఫోన్ చేయలేదే?" వందన ఆశ్చర్యపోయింది.

"అమ్మ సంగతి నీకు తెలుసుగా పిన్ని. నన్ను చెప్పమంది."

"నువ్వు వంటరిగా వెళ్ళలేవా?"

"అమ్మ నన్ను వదిలితే చంద్రమండలంకైనా వెళ్తాను పిన్ని. కానీ వదలదు"

"సరే. కాఫీ కలుపుకో. గుర్తుంచుకో. మీ ఇంటికి వెళ్ళాక మళ్ళా బూస్ట్ తాగాలి" హెచ్చరించింది.

"అసలేం తాగను పిన్ని. బూస్ట్ మూలంగానే లావయ్యానని అక్క చెప్పింది" పవిత్ర వంటగదిలోకి వెళ్ళి కాఫీ తెచ్చుకుని వందన పక్కన కూర్చుంది. కొద్దిసేపటికి కప్పు టీపాయ్ మీద పెట్టి వందన భుజం మీద తల ఆనించి నెమ్మదిగా చెప్పింది.

"నేను నీకు పుట్టి ఉంటే ఎంత బావుండేది పిన్ని."

"అయ్యో! అదేం మాట! పల్లవికి నీ మీద పిచ్చిప్రేమ అంతే. అందుకే అన్ని కండిషన్స్."

"నాకు అనుమానమే పిన్ని. అమ్మకి అంతా తనని మెచ్చుకోవాలని కోరిక. అందుకు నన్ను షో పీస్‌గా చేసింది." పవిత్ర విషాదంగా చెప్పింది.

వందన అనునయంగా ఆమె చుట్టూ చెయ్యి వేసింది.

"టెన్త్ వరకూ నేనూ ఆ ప్రపంచంలోనే ఉన్నాను పిన్నీ. నేనొక్కదాన్నే మంచిదాన్ని. మిగిలిన పిల్లలంతా చెడ్డవాళ్ళు. నేను చాలా పద్ధతిగా పెరుగుతున్నాను. వాళ్ళు గాలికి, ధూళికి పెరుగుతున్నారని ఫీలయ్యేదాన్ని. మా అమ్మ దేవత. మిగిలిన అమ్మలు పిల్లల్ని పట్టించుకోని వాళ్ళని అనుకునేదాన్ని. నీతో సహా అందరి మీదా నాకు చులకన భావం ఉండేది. మీ పిల్లలతో కలిస్తే చెడిపోతానని మా అమ్మ నూరిపోసేది.

"ఇంటర్మీడియెట్‌లోకి వచ్చాక నా ప్రపంచం కొంచెం విశాలమైంది. తోటి పిల్లల్ని చూసాక నేనేం కోల్పోతున్నానో అర్థమైంది. అందరూ స్వేచ్ఛగా ఉంటే, నా చుట్టూ కనిపించని ఇనపబోను ఉందేమో అనిపించింది. దుప్పటిలాంటి క్లాత్ మందమైన పంజాబీ డ్రెస్‌లు, ఫుల్ హేండ్స్ కూడా కుట్టించింది. మొదటిసారి ఎదురు తిరిగి చెప్పాను. 'ఇవి బాలేదమ్మా చెమటపోస్తోంది కొంచెం పల్చటివి కొనచ్చుగా.'

అంతే మా అమ్మ పూనకం వచ్చినట్లు ఊగిపోయింది. నేను చెడిపోతున్నానంది. మిగిలిన పిల్లలు చెడగొడుతున్నారు అంది. ఇంకోసారి ఇలాంటి మాటలు మాట్లాడితే కాలేజీ మాన్పిస్తానంది. దాంతో భయపడిపోయాను. బంధువుల పెళ్ళిళ్ళంటే నాకు టార్చర్. లంగా ఓణీ నగలు. జీవితం మీద విరక్తి పుట్టేది. కళ్ళజోడుకి, పాపటి గొలుసు, వడ్డాణాలకి మేచ్ కాదంటే వినేదికాదు. పెళ్ళిలో కనిపించిన పెద్దవాళ్ళ కాళ్ళకి దండాలు పెట్టించేది. తన దగ్గరే కూర్చోపెట్టుకునేది. నాముందే నన్ను పొగుడుతూంటే సిగ్గుతో చచ్చేదాన్ని. చివరికి ఆ అమ్మలక్కలందరూ నేను చాలా బుద్ధిమంతురాలినని, అమ్మ పెంపకం చాలా గొప్పదని తీర్మానించేవారు. దాంతో ఆవిడ కళకళలాడిపోయింది. ప్రతీ పెళ్ళిలో ఇదే తంతు. మెడిసిన్ చదవాలని చాలా కోరికగా ఉండేదినాకు. కానీ అమ్మ ఒప్పుకోలేదు. "దరిద్రపు చదువు. అందర్ని ముట్టుకోవాలి, అన్ని అవయవాలు ముట్టుకోవాలి అని కొట్టిపారేసింది. బిఫార్మసీలో చేరాక విక్టర్ పరిచయమయ్యాడు."

వందన ఉలిక్కిపడింది. ఆముక్త అతడి గురించి చెప్పినా ఆమె నమ్మలేకపోయింది.

"అందరమ్మాయిలకి భిన్నంగా ఉన్న నన్ను చూసి మొదట్లో జాలిపడ్డాడు. తర్వాత నాతో స్నేహం చేసాడు. ఎప్పుడు అది ప్రేమగా మారిందో చెప్పలేను కాని విక్టర్ నా జీవితంలో ముఖ్యమైనవాడయ్యాడు. అమ్మకి ప్రేమంటే ఎగతాళి. తన పెంపకం మీద నమ్మకం. నేను అమాయకురాలినని విశ్వాసం నన్ను సొసైటీ కళ్ళతో చూస్తుంది. సమాజానికి చాలా విలువిస్తుంది. నేను నైన్త్ క్లాస్ చదివేప్పుడు ఏమైందో తెలుసా పిన్ని?"

వందన విస్ఫారిత కళ్ళతో పవిత్రనే చూస్తోంది. నెమ్మదిగా ఉండే ఈ అమ్మాయిలో ఎన్ని సంఘర్షణలు ఉన్నాయి. పల్లవిని ఎంత బాగా విశ్లేషిస్తోంది.

"ఓసారి మా క్లాస్‌మేట్ తన కేరేజ్‌లోంచి నాకు ఓ స్పూన్ కూర వేసింది. 'ఏ కూర?' అని అడిగితే మష్రూం అని చెప్పింది. 'మేం తినం' అంటే 'అది వెజిటేరియనే' అని చెప్పింది. మసాలా వాసన వస్తున్న ఆ కూర రుచిగా ఉంది. తినేసాను. తర్వాత చెప్పింది అది చికెన్ అని. నేను భయపడిపోయాను. ఇంటికి వచ్చి మా అమ్మకి చెప్పాను. దానికి మా అమ్మ ఏమందో తెలుసా? 'తింటే తిన్నావుకానీ ఎవరికీ చెప్పకు. ఆ పిల్లతో ఇంక మాట్లాడొద్దు. ' అమ్మ మీద నాకు మొదటిసారి గౌరవం పోయింది. నేను తినడంకాదు తప్పు. అది బయటకి తెలియడం తప్పు. ఈ మనస్థత్వం నాకు నచ్చలేదు. నాన్న దేవుడిలాంటివాడు. ఆయనలాగే నాన్నలో కూడా ఏ స్పందనా ఉండదు. అమ్మ ఆయన్ని నోరెత్తనివ్వదు. మనసులో అమ్మని ఎదిరించాలని, నా ఇష్టమొచ్చినట్లు ఉండాలని అనుకునేదాన్ని. కానీ అమ్మని చూస్తే కాళ్ళూ చేతులు వణుకుతాయి. ఇక్కడికి వచ్చిన ఈ మూడు నెలల్లో ఎంత స్వేచ్ఛగా ఉన్నానో. అమ్మూకి మీరిచ్చిన స్వేచ్ఛ, తనమీద మీరున్న నమ్మకం అమ్మకి నామీద లేవు. ఈ ఇంటర్న్ షిప్ విక్టర్ ఇప్పించాడు. తనూ అందులోనే చేసాడు. పెద్దవాళ్ళకి చెప్పి పెళ్ళి చేసుకుందామన్నాడు. మా అమ్మ ఒప్పుకోదు. రిజిస్టర్ మేరేజ్ చేసుకుందాం అన్నాను. వాళ్ళు ఏడుస్తూంటే మనం హేపీగా ఉండలేం అన్నాడు. తప్పక రాత్రి మా అమ్మకి చెప్పాను. తను అడిగిన మొదటి ప్రశ్న 'ఈ సంగతి వంది వాళ్ళకి తెలుసా?' తెలీదని చెప్పాను. తర్వాత ఓ గంట తిట్టిపోసింది. సారాంశం ఈ పెళ్ళికి ఒప్పుకోను అని. ఇవాళ విక్టర్‌ని ఒప్పించడానికి ట్రై చేసాను. 'వెయిట్ చేద్దాం' అంటాడు. మా అమ్మ గురించి చెప్పినా అదేమాట. అలసిపోయాను పిన్ని."

వందన ఒళ్ళో తలపెట్టి వెక్కి వెక్కి ఏడ్చింది పవిత్ర.

ఇంట్లోకి అడుగుపెట్టగానే పల్లవిని పవిత్రని నిశితంగా చూసింది. సన్నబడ్డ పవిత్ర కళ్ళజోడులేకుండా అందంగా ఉంది. పక్కనే ఉన్న ఆముక్తని చూడగానే దాని రంగులో సగమైనా దీనికి రాకూడదా అనుకుంది.

"రేపు మార్నింగ్ ఫ్లయిట్‌కి వెళ్తున్నాం. సామాను సర్దుకో" కూతురితో చెప్పింది.

"అదేంటి? రేపు సాయంత్రం వెళ్ళచ్చుగా?" వందన అడిగింది.

"బావ పదింటికల్లా ఆఫీస్‌లో ఉండాలి." పల్లవి ముక్తసరిగా చెప్పింది.

పదకొండు రోజుల తర్వాత పల్లవి నించి ఫోన్ వచ్చింది.

"వచ్చే శుక్రవారం పవిత్ర పెళ్ళే. శుభలేఖలు రాగానే పోస్ట్ చేస్తాను. రైలు టిక్కెట్లు కొనుక్కుంటారని ముందు చెప్తున్నా." చెప్పింది.

"ఇంత సడన్‌గా ఏంటి? అబ్బాయ్ ఏం చేస్తుంటాడు?" ఎక్కడో ఆశ మిణుకుమిణుకు మంటూంటే అడిగింది.

"సాఫ్ట్‌వేర్. అమెరికాలో. మా అత్తగారివైపు బంధువులు. ఈ కాలం పిల్లల్లో పవిత్రలాంటి పద్ధతైన పిల్ల అరుదని, ప్రేమలు, దోమలులాంటి వెధవ్వేషాలు వేయకుండా బుద్ధిగా చదువుకుందని వెంటపడి మరీ చేసుకుంటున్నారు." కొద్దిగా గర్వంగా చెప్పింది.

"ఓ! మరి పవిత్రని వదిలి ఉండలేనంటావు. అది అమెరికాపోతే ఎలా ఉంటావు?"

"ఓ అయ్య చేతిలో పెట్టాక అతను ఎక్కడుంటే అక్కడే ఉండాలిగా?"

పవిత్ర ఒప్పుకుందా అని అడగాలనుకుంది కాని తనకి విక్టర్ సంగతి తెలుసు అని అనుమానిస్తుందని ఊరుకుంది.

వందన పెళ్ళికి వెళ్ళలేదు. భర్తని పంపించింది.

"వాళ్ళమ్మాయికన్నా చిన్నది మా పవిత్ర పెళ్ళి ముందవుతోందని మా వందనకి కుళ్ళు. అందుకనే రాలేదు" పల్లవికి బంధువులందరికీ చెప్పింది.

ఆ తర్వాత తన కూతురిని ఎంత పద్ధతిగా పెంచిందీ వివరించింది మరోసారి.

పదిహేను రోజుల తర్వాత పవిత్ర భర్తతో అమెరికా వెళ్ళిపోయింది.

"కథ సుఖాంతమైంది కదా. నువ్వెందుకు దిగులుపడుతున్నావు. రాజీపడటం, అడ్జస్ట్ అవడం ప్రతాకి చిన్నప్పటినించీ అలవాటే. బానే ఉంటుందిలే" ఆముక్త తల్లిని ఓదారుస్తూంటుంది.

*(వచ్చే సంచికలో మరో సరిగమ)*

Click here to share your comments